మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర   సంపుటి : 08   సంచిక : 189   గురువారం   08 - 01 - 2026   పేజీలు: 8   వెల: 4

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి




3లో..



### బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై

# మరో దాడి

- దొంగతనం నెపంతో వెంటాడిన గుంపు
- కాలువలో దూకి ప్రాణాలు కోల్పోయిన హిందూ యువకుడు
- 19 రోజుల్లో ఏడో ఘటనగా నమోదు

మన గళం డెస్క్ : బంగ్లాదేశ్లో మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్న హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. నౌగావ్ జిల్లాలోని మహాదేవ్‌పూర్ ఉపజిల్లాలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘటనలో దొంగతనం ఆరోపణలతో ఓ గుంపు వెంబడించడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కాలువలోకి దూకిన హిందూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానిక

2 లో..




## పోలవరం పనులపై సీఎం చంద్రబాబు

# ప్రత్యేక దృష్టి

- ప్రాజెక్టు సైట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష
- 87 శాతం సివిల్ పనులు పూర్తి
- పునరావాసం, కాలువల పనుల వేగవంతానికి ఆదేశాలు

మన గళం, పోలవరం : పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో అధికారులు ప్రాజెక్టులో ఇప్పటివరకు 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ముఖ్యంగా నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరు అందేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచనలు చేశారు. సాగునీరు, తాగునీటి అవసరాలు సమన్వయంతో నెరవేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

### వీధి కుక్కలపై సుప్రీంకోర్టు

# కీలక వ్యాఖ్యలు



- కుక్కలు ఎప్పుడు కరుస్తాయో ఎవరికీ తెలియదు
- వాహన ప్రమాదాలకు కారణమవుతున్న శునకాలు
- ముందస్తు జాగ్రత్తలే ఉత్తమం: ధర్మాసనం

మన గళం, న్యూఢిల్లీ : వీధుల్లో సంచరించే కుక్కలు ఎప్పుడు కరుస్తాయో ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్‌ను అర్థం చేసుకోవడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వీధి కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని కూడా గుర్తుచేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్‌ను ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, వీధి

2 లో..

## మన్యం జిల్లాలో ఏనుగుల హల్‌చల్



- గంగరేగువలసలో పంటలకు భారీ నష్టం
- పెరుగుతున్న ఏనుగుల సంఖ్యతో గ్రామాల్లో భయం
- నష్టపరిహారం, భద్రత చర్యలు కోరుతున్న రైతులుపార్వతీపురం

2 లో..

## అనుమతులు ఉన్నా మైనింగ్‌కు అడ్డంకులు





- పుంగనూరు సదుంలో ఆగడాలపై ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు
- స్థానికేతరులపై బెదిరింపులు సహించం
- చట్టప్రకారం కఠిన చర్యలు: డిప్యూటీ సీఎం

2 లో..

## వెనిజువెలాపై అమెరికా ఆధిపత్యం

- చమురే ఆయుధంగా ట్రంప్ ఒత్తిడి
- కొత్త ప్రభుత్వానికి కఠిన షరతులు



మన గళం డెస్క్ : వెనిజువెలాపై అమెరికా తన ఆధిపత్యాన్ని మరింత బలంగా ప్రదర్శిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనిజువెలాను తానే నియంత్రిస్తున్నానని ప్రకటిస్తూ, ఆ దేశ చమురు ఉత్పత్తి, ఎగుమతులపై కఠిన షరతులు విధించేందుకు ముందుకు వస్తున్నారు. ఇటీవల వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా

2 లో..

## కోనసీమలో ఓఎన్‌జీసీ బావి మంటలు అదుపులోకి రాని పరిస్థితి

- మూడో రోజూ కొనసాగుతున్న అగ్నికీలలు
- వివిధ రాష్ట్రాల నిపుణుల ప్రయత్నాలు విఫలం
- పంట నష్టం, కాలుష్యంపై ప్రభుత్వ సర్వే

అమరావతి, జనవరి 7 (మన గళం :డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం ఇరుసుమండల సమీపంలో ఉన్న ఓఎన్‌జీసీ బావిలో చెలరేగిన మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. బుధవారం మూడో రోజు

2 లో..



# బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై మరో దాడి




మీడియా కథనాల ప్రకారం చాక్‌గోరి ప్రాంతానికి చెందిన మిథున్ సర్కార్ (25)పై కొందరు దొంగతనం నెపం మోపి వెంటాడారు. వారి నుంచి తప్పించుకునే క్రమంలో సమీపంలోని లోతైన కాలువలోకి దూకిన మిథున్ బలమైన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి కొన్ని గంటల తర్వాత మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి షాహిదుల్ ఇస్లాం స్పందిస్తూ, దొంగతనం అనుమానంతో వెంబడించడంతో యువకుడు కాలువలోకి దూకినట్లు ప్రాథమిక సమాచారం ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, ఘటనపై లోతుగా దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గత 19 రోజుల్లో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడుల్లో ఇది ఏడో ఘటన కావడం గమనార్హం. ఈ వారంలోనే ఇది మూడో ఘటనగా నమోదైంది. ఇటీవల నర్సింగ్డి జిల్లాలో శరత్ చక్రవర్తి, జషోర్ జిల్లాలో రాణా ప్రతాప్ బైరాగి హత్యలు సంచలనం సృష్టించాయి. అంతకుముందు డిసెంబర్‌లో దైవదూషణ ఆరోపణలతో దీపు చంద్ర దాస్‌పై జరిగిన దారుణ హత్య ప్రపంచవ్యాప్తంగా ఆందోళన రేకెత్తించింది. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెరుగుతున్నాయన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

# వీధి కుక్కలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

కుక్క కరవొచ్చున్న అనుమానం ఉంటే స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అధికారులు ఆ కుక్కను తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి తిరిగి వదిలిపెడతారని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత మనుషులను కరవకుండా ఉండేందుకు కుక్కలకు కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. మనుషులను కరవడమే కాకుండా, వీధుల్లో కుక్కలు అకస్మాత్తుగా పరుగులు పెట్టడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. ప్రమాదం జరిగిన తర్వాత చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకోవడమే మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లోనే కాకుండా స్కూళ్లు, విద్యాసంస్థల పరిసరాల్లో కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. అన్ని వీధి కుక్కలు కరవకపోయినా, రోడ్లపై అవి అడ్డదిడ్డంగా తిరగడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం మాత్రం ఉన్నదని ధర్మాసనం స్పష్టంగా పేర్కొంది.

## 2026లో భారత నౌకాదళంలోకి 19 యుద్ధ నౌకలు

న్యూఢిల్లీ, జనవరి 7 మన గళం ::భారత నౌకాదళం 2026 సంవత్సరంలో ఏకంగా 19 యుద్ధ నౌకలను సేవలోకి తీసుకురానుంది. ఇది ఒక్క ఏడాదిలోనే భారత నౌకాదళ చరిత్రలో అతిపెద్ద బలవృద్ధిగా నిలవనుంది. ఈ పరిణామం దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యం ఎంతగా అభివృద్ధి చెందిందో స్పష్టంగా చూపిస్తోంది. ఈ నౌకాదళ విస్తరణలో ఆధునిక నీలగిరి తరహా స్టెల్త్ ఫ్రిగేట్లు ప్రధానంగా ఉండనున్నాయి. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమైన ఈ నౌకలు రాడార్‌కు చిక్కకుండా పనిచేయగల సామర్థ్యంతో పాటు, బహుముఖ యుద్ధ సామర్థ్యాలను కలిగి ఉంటాయి. గతంలో యుద్ధ నౌక నిర్మాణానికి 8 నుంచి 9 సంవత్సరాలు పట్టేదిగా ఉండగా, ఇప్పుడు కేవలం 6 సంవత్సరాల్లోనే నిర్మాణం పూర్తిచేయగల స్థాయికి భారత్ చేరుకుంది. కృత్రిమ మేధస్సు ఆధారిత సమన్విత నిర్మాణ విధానం, ఆధునిక డిజైన్ సాఫ్ట్‌వేర్, 250 టన్నుల బ్లాక్‌లుగా విభజించిన మాడ్యులర్ నిర్మాణ పద్ధతి, అత్యంత ఖచ్చితమైన ఇంజినీరింగ్ ఈ పురోగతికి కీలకంగా నిలిచాయి. ఇవన్నీ కలిసి దేశీయ నౌకా నిర్మాణ రంగాన్ని మరింత బలోపేతం చేశాయి. అయితే, ఈ విస్తరణ చైనా నౌకాదళంతో పోలిస్తే ఇంకా పరిమితంగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. చైనా 2030 నాటికి సుమారు 435 యుద్ధ నౌకలతో అతిపెద్ద నౌకాదళాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయినప్పటికీ, భారత నౌకాదళం చేపడుతున్న ఈ బలవృద్ధి ఇండోపసిఫిక్ ప్రాంతంలో దేశ భద్రతా వ్యూహానికి కీలకంగా మారనుంది. మొత్తంగా, 2026లో జరిగే ఈ నౌకాదళ విస్తరణ భారత ఆత్మనిర్భర్ రక్షణ తయారీ విధానానికి, సముద్ర భద్రతా సామర్థ్యాల పెంపుకు ఒక చారిత్రక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వెనిజువెలాపై అమెరికా ఆధిపత్యం

దళాలు అదుపులోకి తీసుకున్న తర్వాత, డెల్సీ రోడ్రిగెజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం, వెనిజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే అమెరికా విధించిన షరతులకు లోబడాల్సిందేనని వాషింగ్టన్ స్పష్టం చేసింది. ముఖ్యంగా చైనా, రష్యా, ఇరాన్, క్యూబా వంటి దేశాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని, చమురు ఉత్పత్తిలో పూర్తిగా అమెరికాతోనే భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేస్తోంది. హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా షరతులు విధించింది. వాస్తవానికి వెనిజువెలా చైనాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఆ దేశం నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసే దేశం చైనానే. ఈ పరిస్థితుల్లో అమెరికా తన షరతులను ఎలా అమలు చేయిస్తుందన్నది కీలకంగా మారింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఓ ప్రైవేట్ సమావేశంలో ఎంపీలతో మాట్లాడుతూ, వెనిజువెలా చమురు ట్యాంకర్లు పూర్తిగా నిండిపోయాయని, అందువల్ల అమెరికా డిమాండ్లకు లొంగక తప్పదని వ్యాఖ్యానించినట్లు సమాచారం. బ్లూంబర్గ్ నివేదిక ప్రకారం, అమెరికా ఆంక్షల కారణంగా నిల్వ సామర్థ్యం లేక డిసెంబర్ చివరి నుంచి వెనిజువెలా చమురు బావులను మూసివేస్తోంది. మరిన్ని బావులు మూసివేయాల్సి వస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుదేలయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని ప్రభావంతో తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ ప్రభుత్వానికి కూడా రాజకీయంగా గట్టి సవాళ్లు ఎదురయ్యే అవకాశముంది. అమెరికా అంచనాల ప్రకారం, రాజధాని కారకాస్ కొన్ని వారాల్లోనే ఆర్థికంగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఎదుర్కొనవచ్చని చెబుతున్నారు. చమురు విక్రయాలు నిలిచిపోతే వెనిజువెలా ఆర్థిక వ్యవస్థ నిలబడలేదన్నది స్పష్టమవుతోంది. సెనేట్ ఆర్మ్డ్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ రోజర్ వికర్ మాట్లాడుతూ, వెనిజువెలా చమురును అమెరికా తన నియంత్రణలోకి తీసుకోవాలని భావిస్తోందని, ఆ ట్యాంకర్లు హవానా వంటి ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకుంటామని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. వెనిజువెలా తాత్కాలిక ప్రభుత్వం 30 నుంచి 50 మిలియన్ బ్యారెల్స్ చమురును అమెరికాకు అప్పగించనుందని, దాన్ని మార్కెట్ ధరకు విక్రయించి వచ్చిన నిధులను తానే నియంత్రిస్తానని తెలిపారు. ఆ డబ్బును వెనిజువెలా ప్రజలు, అమెరికా ప్రజల ప్రయోజనాల కోసం వినియోగిస్తానని పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నీ వెనిజువెలా భవిష్యత్తును మరింత అనిశ్చితంగా మార్చుతున్నాయి. అమెరికా ఆధిపత్యం వల్ల ఆ దేశం ఆర్థికంగా ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటుందో, ఇతర దేశాలతో సంబంధాలు ఎలా ప్రభావితమవుతాయో అన్నది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# మన్యం జిల్లాలో ఏనుగుల హల్‌చల్

మన్యం జిల్లా, జనవరి 7 మన గళం,:మన్యం జిల్లాలో ఏనుగుల గుంపులు రోజురోజుకూ పెరుగుతూ గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నాయి. అడవుల్లో గజరాజుల మధ్య ఆధిపత్య పోరాటం కొనసాగుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ గ్రామంలోకి వచ్చి దాడులు చేస్తాయోనన్న ఆందోళనతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా కాలం గడుపుతున్నారు. తాజాగా కొమరాడ మండలం పరిధిలోని గంగరేగువలస గ్రామంలో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు ప్రవేశించింది. గ్రామంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో సుమారు 70 బస్తాల ధాన్యం నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పంట పొలాల్లోకి దిగి పంటలను ధ్వంసం చేయడంతో పాటు గ్రామాల్లోకి చొచ్చుకురావడం వల్ల ప్రాణభయం నెలకొంటోంది. కొన్ని సందర్భాల్లో ఏనుగులు పరస్పరం పోట్లాడుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. కళ్ల ముందే కష్టపడి పండించిన ధాన్యం నాశనం కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గ్రామం నుంచి ఏనుగుల గుంపును వెంటనే తరలించేందుకు అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని, పంట నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గస్తీ పెంచి భద్రత చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కోనసీమలో ఓఎన్‌జీసీ బావి మంటలు అదుపులోకి రాని పరిస్థితి

కూడా అగ్నికీలలు ఎగిసిపడుతూనే ఉండటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. మంటలను ఆర్పేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఇప్పటివరకు ఫలితం కనిపించలేదు. అగ్నిమాపక యంత్రాలతో నిరంతరం నీటిని విరజిమ్మే చర్యలు కొనసాగుతున్నాయి. అయితే మంటలు పూర్తిగా అదుపులోకి రావడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బ్లోఅవుట్ ప్రాంతానికి సులభంగా చేరుకునేందుకు అత్యవసర రహదారి ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 8 లక్షలు మంజూరు చేసింది. అలాగే ప్రమాద ప్రాంతం చుట్టూ ఒక కిలోమీటర్ పరిధిలోని ఇళ్ల వద్ద అధికారులు ఇంటింటా సర్వే చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఇరుసుమండల పరిసరాల్లో పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. మరోవైపు గాలి, నీటి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నమూనాలు సేకరించి పరిశీలిస్తున్నారు. బుధవారం నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు కూడా బ్లోఅవుట్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమన్వయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. స్థానికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

# అనుమతులు ఉన్నా మైనింగ్‌కు అడ్డంకులు

వెలగపూడి, జనవరి 7 మన గళం :అనుమతులు ఉన్నప్పటికీ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రాలు, ప్రాంతాలు వేరైనా అందరం భారతీయులమేనని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఏ రాష్ట్రం వారు ఏ రాష్ట్రంలోనైనా నివసించవచ్చని, ఉపాధి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో మధ్యప్రదేశ్ మాండ్లా ఎంపీ, ఎస్సీఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సదుంలో మధ్యప్రదేశ్‌కు చెందిన వారు గ్రానైట్ మైనింగ్‌కు చట్టబద్ధ అనుమతులు పొందారని, అయినప్పటికీ స్థానిక నాయకులు మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని డాక్టర్ కులస్తే ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థానికేతరులని పేర్కొంటూ పనులు చేయనీయకుండా





ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. ఈ అంశంపై స్పందించిన పవన్ కళ్యాణ్, అనుమతులు ఉన్న వారు నిబంధనల మేరకు మైనింగ్ చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. చట్టబద్ధ కార్యకలాపాలకు అడ్డుపడే వారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేస్తుందని భరోసా ఇచ్చారు. రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించే చర్యలను ప్రభుత్వం సహించదని ఆయన తేల్చి చెప్పారు.

## ఉపాధి పథకం పేరు మార్పు దుర్మార్గం

**– ఏఐసీసీ సభ్యుడు లక్ష్మినరసింహ యాదవ్**



మనగళం, కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్ముని పేరును తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఏఐసీసీ సభ్యుడు, పాణ్యం నియోజకవర్గం కో ఆర్డినేటర్ జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ ఖండించారు. పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర ఉన్న దామోదర సంజీవయ్య భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకానికి రామ్ జీ అని నాతురామ్ గాడ్సే పేరు వచ్చే విధంగా పేరు పెట్టడం సిగ్గు చేటన్నారు. మహాత్మా గాంధీ గారి పేరు మార్చి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలానే బీజేపీ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లో 90శాతం నిధులిస్తే రాష్టం 10% నిధులు ఖర్చు పెట్టి దాదాపు 100 రోజులు పని ఆహార పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో అమలు అయ్యేదని గుర్తు చేశారు. దక్షిణాది రాష్టాలే ఈ పథకాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారని ఓర్వలేక బీజేపీ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కార్యక్రమం లో కేకేసీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు, కడప, అనంతపురం జిల్లాల ఇంచార్జ్ పఠాన్ అభిబ్ ఖాన్, నంద్యాల పార్లమెంట్ ఆర్గనైజేషర్, ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎస్ రజాక్ వలి, కిసాన్ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రెవెన్యూ క్లినిక్ లు, స్పెషల్ క్యాంపుల ద్వారా వచ్చిన అర్జీలు, ఇతర రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పత్తికొండ డివిజన్ పరిధిలో రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం, ఇనాశీ పట్టాలు, చుక్కల భూములు, రీ సర్వే ప్రక్రియ తదితర అంశాలపై తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వారం ఒక డివిజన్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఒక నెల లోపు సమస్యలన్నింటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, తప్పులు జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మంచి ఫీడ్బ్యాక్ వచ్చేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు కృషిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో తుది డిఎల్ఆర్ (ఫైనల్ డీఎల్ఆర్) ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, ఎటువంటి లోపాలకు తావు లేకుండా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నపాటి తప్పిదాల వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, ప్రతి దశను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అలాగే ఇనాం, చుక్కల భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఇనాం, నిషేధిత జాబితా, రీ సర్వే తదితర రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మనగళం, కర్నూలు సిటీ : 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు, న్యూ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలో భాగంగా కలెక్టర్ కార్యాలయం దగ్గర గాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దయ్య నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగుల పట్ల భవ్య యాజమాన్యం చేస్తున్న వేధింపులను ఆపాలని కోరారు. షోకాజ్ నోటీసులు, సస్పెండ్ లాంటి చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన క్యాజువల్ లీవ్ లను ఈఎల్ లను తక్షణమే పునరుద్ధరణ చేయాలని, అరబిందో యాజమాన్యం చివరి నెల చెల్లించిన వేతనాలను ప్రతి ఉద్యోగికి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రహాస్, షరీఫ్, జోజప్ప, మల్లికల్, రాఘువేంద్ర, కళ్యాణి, మంజుల, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య నారాయణ దేవాలయమును సందర్శించిన పద్మాకర్





మనగళం, కర్నూలు సిటీ : జయ గురు దత్త శ్రీ గురుదత్త ప్రణవపీఠ వ్యవస్థాపకులు, అభినవ శుక, పురాణ చక్రవర్తి, బ్రహ్మ శ్రీ వద్దిపర్తి పద్మాకర్ కర్నూలు శ్రీ సూర్య నారాయణ దేవాలయమును సందర్శించారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దత్త పీఠముతో తన అనుబంధాన్ని వివరించారు. గణపతి సచ్చిదానంద స్వామిజీ, శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీపై తనకున్న భక్తి భావం, ప్రేమ వాత్సల్యం గురించి భక్తులకు వివరించారు . అనంతరం శ్రీ సూర్య దేవాలయ విశిష్టతను, సూర్య ఉపాసనలను గూర్చి తెలిపారు. సూర్య ఉపాసనకు గల పర్వదినాలను గూర్చి వివరించారు. అనంతరం బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ను ఆలయ ట్రస్ట్ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ శివ రామ కృష్ణ , డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాతృ మండలి సభ్యులు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యనారాయణ స్వామి దేవాలయంలో పూజలు





మనగళం, కర్నూలు సిటీ : జయ గురుదత్త శ్రీ గురుదత్త గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రదోష కాలమున సంకష్టహర చతుర్థి వ్రతం చేశారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా అమలు చేయాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో సీ అండ్ డీ (కన్స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్) వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ తన క్యాంపు కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్మెంట్ విధానంపై సమావేశం నిర్వహించారు. నగర సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణకు సీ అండ్ డీ వ్యర్థాల నిర్వహణ కీలకమని పేర్కొన్నారు. నిర్మాణాలు, కూల్చివేత పనుల నుంచి వచ్చే సీ అండ్ డీ వ్యర్థాలను ప్రజలు ఎక్కడబడితే అక్కడ పడేయకుండా యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. సీ అండ్ డీ వ్యర్థాల సేకరణ, తరలింపునకు ట్రాక్టర్‌కి రూ.500 చొప్పున ప్రకారం నామమాత్రపు రవాణా చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారికంగా నియమిత వ్యవస్థ ద్వారానే తరలించాలని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు సీ అండ్ డీ వ్యర్థాలను తరలించడం అనుమతించబోమని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఆదాయానికి నష్టం చేకూర్చితే సహించం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కి రావాల్సిన ఆదాయానికి గుండి పడేలా వ్యవహరిస్తే సహించబోమని, కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం ఆయన రెవెన్యూ విభాగ సిబ్బందితో మున్సిపల్ దుకాణాల అద్దెలు, పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. టైటిల్ ట్రాన్స్ఫర్, పన్ను విధింపు సమయంలో అవకతవకలను ఉపేక్షించబోమని, మున్సిపల్ షాపుల గుడ్‌విల్, అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ పై నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షతన సాగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ నాగరాజు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి ఆహార ధాన్యాల రవాణా, రైల్వేల ద్వారా రవాణాను ఆప్టిమైజ్ చేయడం అనే అంశం పై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన మేనేజింగ్ డైరెక్టర్, సదరన్ రైల్వేస్ జనరల్ మేనేజర్, తమిళనాడు ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

- వీబీ-జీ-రామ్- జీ బిల్లును రద్దు చేయాలి
- జనవరి 10న రాష్ట్రస్థాయి సదస్సు




మనగళం, కర్నూలు సిటీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని, వీబీ-జీ-రామ్- జీ బిల్లును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి ఎం నబిరసూల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కర్నూలు నగరంలోని సీఆర్ భవన్ లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుకూలీలు, రైతుల వలసలు నివారించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టం స్థానంలో వీబీ-జీ-రామ్- జీ బిల్లును ఎందుకు తీసుకురావడం ఓ కుట్ర అని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా పేదలకు దూరం చేసే కుట్రను కేంద్రం ప్రారంభించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు కేటాయించే విధంగా చట్టం రూపకల్పన చేయడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కేంద్రం కేటాయింపుల కంటే అదనంగా ఉంటే, ఆదనపు ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, కొత్త బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాల్సిన బాధ్యతలపై కర్నూలు నగరంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో జనవరి 10 వ తేదీన కర్నూల్ నగరంలోని జిల్లా పరిషత్ హాల్లో ఉదయం 11 గంటలకు రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తలుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూ సీ ), ఏఐసీసీ ఇన్చార్జి జార్ఖండ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అప్పిలేట్ అథారిటీ చైర్మన్నీలయ్య జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ,రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్, లిబ్ టెక్ ఇండియా సీనియర్ పరిశోధకులు చక్రదర్ బుద్ధ, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆర్ వెంకట్రావు, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పి భీమలింగప్ప, సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, జిల్లా కార్యదర్శి, బీకేఎం యు జాతీయ కార్యవర్గ సభ్యులు బి కేశవరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించే వరకు పోరాడుతామని, ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే భూపేష్ , నంద్యాల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కే రాధాకృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సి మహేష్ పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి లీలా వెంకట శేషాద్రి





మనగళం, కర్నూలు సిటీ : మాదక ద్రవ్యాలు చాలా ప్రమాదకరని, యువతం వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సూచించారు. జాతీయ యువ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బుధవారం కర్నూలు బి. క్యాంపులోని బాలికల హాస్టల్ లో డ్రగ్స్ రహిత భారతదేశం పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాదక ద్రవ్యాల వినియోగం వలన యువతకు కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, సామాజిక దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలు డ్రగ్స్ నేరాలు, సంబంధిత అంశాలపై నేరుగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1933 కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. దీనివల్ల డ్రగ్స్ ట్రాఫికింగ్ ను ఎదుర్కోవడానికి మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. "డ్రగ్స్ వద్దు ...జీవితమే ముద్దు " అనే ప్రతిజ్ఞను బాలికలతో చేయించారు. కర్నూలు వివేకానంద అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరేష్ మాట్లాడుతూ వివేకానందుడు పిల్లలందరికీ ఆదర్శప్రాయం అని తెలిపారు. గవర్నమెంట్ టీచర్ గీతా పుష్ప లత మాట్లడుతూ వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని యువత జీవితంలో అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. కర్నూలు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారు పెళ్లి చేసుకుంటే బాలిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా గర్భవతి అయితే గర్భంలోనే శిశువు మరణించే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞను బాలికల తో చేయించారు. పిల్లలకు చట్టపరమైన సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ కనకలత, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో మౌనిక తదితరులు పాల్గొన్నారు.


## ఎంఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా జయన్న నియామకం

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : మాదిగ సంక్షేమ పరిషత్ (ఎంఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎనుముల జయన్న మాదిగను నియమించారు. మాదిగ సంక్షేమ పరిషత్(ఎంఎస్పీ) (రిజిస్టర్ నం:273/2024) జాతీయ, రాష్ట్ర స్థాయి నూతన కమిటీల నియామకంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా, కేటీఆర్ నగర్, వీరన్నపేటకు చెందిన సీనియర్ నాయకులు ఎనుముల జయన్న మాదిగ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎనుముల జయన్న మాదిగ మాట్లాడుతూ "మాదిగ సంక్షేమ పరిషత్" జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తెన్నేటి సురేష్ మాదిగ నాయకత్వంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. సంఘం విధి విధానాలకు అనుగుణంగా మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం నా వంతుగా పని చేస్తానని తెలిపారు. నన్ను ఎన్నిక చేసిన జాతీయ అధ్యక్షులు దరూరు నరేష్ మాదిగ, జాతీయ మహిళా అధ్యక్షురాలు నూతంకి కృష్ణ రేఖ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆదోనిని జిల్లా ప్రకటించాల్సిందే..

- దీక్షలకు సంగీబావం తెలిపిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్రెడ్డి.
- ఉద్యమానికి అమ్మ ఆస్పత్రి నిర్వాహకులు రూ. 10 వేలు విరాళం.





( ఆలూరు మనగళం ):వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని లేక పోతే పోరాటం ఉధృతం చేస్తామని వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్రెడ్డి తేల్చి చెప్పారు..ఆదోని జిల్లా కోసం ఆలూరు జేఏసీ ఆధ్వర్యంలో 27 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరం లో బాపురం,పచర్లపల్లి భగత్ సింగ్ యూత్ సభ్యులు కూర్చున్నారు. దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఉద్యమానికి పోరాటం చేస్తున్న ప్రతిఒక్కరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉద్యమం కొనసాగిస్తున్న జేఏసీకి ఆలూరు అమ్మ ఆస్పత్రి ఎం.డి పచర్లపల్లి రాఘవేంద్ర రెడి రూ.10 వేలు విరాళమిచ్చారు. అనంతరం సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఐదు నియోజకవర్గాల ప్రజల కోరిక ఆదోని జిల్లా అన్నారు. అయితే, చంద్రబాబు ప్రభు త్వం ప్రజల ఆకాంక్షను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, ఆలూరు జె ఏ సి నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, ఎల్లప్ప, చాంద్రకాంత్ రెడ్డి, వెంకటేష్, పూల రామాంజినేయులు పాల్గొన్నారు. దీక్షల్లో భగత్ సింగ్ యూత్ సభ్యులు జనార్దన్, శ్రీరాములు, పాండు, తిమ్మప్ప, శివకుమార్, లింగన్న, నాథనేయల్, నాగరాజు, గోపాల్, మరెన్న, లింగమూర్తి, గణేష్, వీరేష్, ఈరన్న, జాన్, కూర్చున్నారు.

## మీ పాలసీ ల్యాప్స్ అయ్యిందా?

హైదరాబాద్ 03-01-2026 మనగళం :. ఏదైనా కారణాలతో జీవిత బీమా పాలసీ నిలిచిపోయి ఇబ్బంది పడుతున్న పాలసీదారులకు భారీ ఊరట లభించింది. నిలిచిపోయిన వ్యక్తిగత పాలసీలను మళ్లీ చెల్లుబాటు చేసుకునేందుకు జీవిత బీమా సంస్థ ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం జనవరి 1, 2026 నుంచి మార్చి 2, 2026 వరకు అమల్లో ఉంటుంది. ఈ కాలంలో పాతగా నిలిచిపోయిన నాన్ లింక్డ్ పాలసీలను తక్కువ వ్యయంతో పునరుద్ధరించుకునే అవకాశం కల్పించారు.భారీ ఆలస్య రుసుములు భరించలేక చాలామంది పాలసీదారులు పునరుద్ధరణకు వెనుకడుగు వేస్తున్న పరిస్థితిని గుర్తించిన సంస్థ, ఈసారి ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. నాన్ లింక్డ్ పాలసీలపై ఆలస్య రుసుముల్లో 30 శాతం వరకు తగ్గింపు అందించనున్నారు. గరిష్టంగా రూ.5000 వరకు రాయితీ లభిస్తుంది. సూక్ష్మ బీమా పాలసీలకు సంబంధించినవారికి అయితే పూర్తిగా ఆలస్య రుసుము మినహాయింపు వర్తిస్తుంది. అంటే వారికి ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉండదు.ఆర్థిక ఇబ్బందులు, అనుకోని పరిస్థితుల వల్ల సకాలంలో ప్రీమియం చెల్లించలేక పాలసీ నిలిచిపోయిన వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రీమియం కాలంలో ఆగిపోయినా ఇంకా మెచ్యూరిటీకి చేరని పాలసీలను ఈ పథకం కింద పునరుద్ధరించుకోవచ్చు. అయితే ఈ రాయితీలు కేవలం ఆలస్య రుసుముకు మాత్రమే వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. పాలసీ పునరుద్ధరణకు వైద్య పరీక్షలు అవసరమైతే వాటిపై ఎలాంటి తగ్గింపులు వర్తించవని తెలిపింది.

## నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : దేశవ్యాప్తంగా ఉన్నత విద్యపై మరింత నియంత్రణను పెంచే, రాష్ట్రాల హక్కులను కాలరాసే వితసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ -2025 బిల్లును మోడీ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.డి రఫీ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు అరండల్ పేటలోని కామ్రేడ్ మాదాల నారాయణస్వామి భవనంలో జరిగిన మీడియా సమావేశంలో రఫీ మాట్లాడారు. రాష్ట్రాల హక్కులను హరించే విధంగా, ఉన్నత విద్యపై మరింత నియంత్రణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ 2025 బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ చర్య రాజ్యాంగ వ్యతిరేకమైందని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఏర్పడిన యూజీసీ, అలాగే సాంకేతిక విద్యకు సంబంధించిన ఏఐసిటిఈ, పాఠశాల విద్యకు సంబంధించిన ఎన్ సిటిఈలను రద్దుచేసి భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్ఈసిఐ) గా తీసుకొచ్చి విద్యపై మరింత కేంద్రీకరణ పెంచుతుందని విమర్శించారు. అశాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థుల మెదల్లోకి చొప్పించడానికి మోదీ సర్కారు చూస్తుందని దుయ్యబట్టారు. నూతన జాతీయ విద్యా విధా నాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్ యూ జాతీయ నాయకులు యు. గనిరాజు మాట్లాడుతూ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించడానికి కాలు దువ్వుతుందని విమర్శించారు. మాట వినని దేశాలపై మారణ హోమం సాగిస్తుందని, టారిఫ్ ల పేరుతో ప్రపంచ దేశాలపై అధిక సుంఖాలు విధించి ఆర్థిక సంక్షోభాలను సృష్టిస్తుందన్నారు. వెనెజువెలాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో అతని భార్య సిలియోలను అమెరికా నిర్బంధించడం దుర్మార్గమని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. అలాగే కొలంబియా, మెక్సికో, క్యూబా దేశాలను బెదిరింపులకు గురి చేస్తుందని అన్నారు. ఈ సంఘటనను రష్యా, చైనా వంటి దేశాలు తీవ్రంగా ఖండిస్తుంటే మోడీ ప్రభుత్వం మౌనవ్రతం చేస్తూ, అమెరికా సామ్రాజ్యవాదానికి గూలంగిరి చేస్తుందని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అమెరికాకు మోదీ ప్రభుత్వం లొంగుబాటు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని గనిరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు కే నాగరాజు,షహీద్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం
08- 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## వెనిజులా పతనం: ఒక దేశం కాదు... ఒక సమాజం హత్య

వెనిజులా పతనం అనేది కేవలం ఒక దేశం ఆర్థికంగా కూలిపోయిన కథ కాదు. అది తరాలుగా కొనసాగిన ఒక మానసిక నేరం. ప్రజల ఆలోచనలను, శ్రమ విలువను, ప్రశ్నించే స్వభావాన్ని నెమ్మదిగా హత్య చేసిన రాజకీయ ప్రయోగం. ఒకప్పుడు లాటిన్ అమెరికాలో అత్యంత సంపన్న దేశంగా, ప్రపంచానికి చమురు సరఫరా చేసే శక్తిగా ఉన్న వెనిజులా నేడు ఆకలి, నిరుద్యోగం, శరణార్థుల దేశంగా మారడం వెనుక తుపాకులు లేవుడ బాంబులు లేవుడ ఉన్నాయి కేవలం మైండ్ మానిప్యులేషన్.వెనిజులా కూలిపోయిందంటే చాలా మంది వెంటనే అమెరికాపై నింద వేస్తారు. అది ఒక భాగం మాత్రమే. అసలు ప్రశ్న ఒక సంపన్న దేశం ప్రజలే ఎలా తమ భవిష్యత్తును నాశనం చేసుకున్నారు? సమాధానం స్పష్టం. ప్రజల మెదళ్లలో ద్వేషం, అసూయ, ఉచితాల మత్తు నాటిన రాజకీయ విధానం. శత్రువుల్ని సృష్టించి, తప్పుడు రక్షకుడిగా మారి, ప్రజాస్వామ్యాన్ని నెమ్మదిగా అంతమొందించిన ఒక స్క్రిప్ట్.హ్యూగో చావెజ్ వచ్చాక మొదలైన ఈ ప్రయాణం, “పెద్ద పరిశ్రమదారులే శత్రువులు” అనే నినాదంతో ప్రజల ఆలోచనలను మలిచింది. ఇది ఆర్థిక విశ్లేషణ కాదు, భావోద్వేగాలపై దాడి. పరిశ్రమలపై ద్వేషం పెరిగింది, పెట్టుబడిదారులు పారిపోయారు. ఆ తర్వాత ఉచితాల వర్షం మొదలైంది. పని చేయకపోయినా డబ్బు, చమురు, సబ్సిడీలు. శ్రమఫలితం మధ్య ఉన్న సహజ సంబంధం తెగిపోయింది. ప్రజలు బ్రతికారుడ కానీ ఆలోచించడం మానేశారు.ఆర్థిక వ్యవస్థ కూలినప్పుడు తీసుకున్న నిర్ణయం మరింత ప్రమాదకరం. “ఎక్కువ నోట్లు ముద్రిద్దాం” అన్న మాయ. ఇది పేదరికాన్ని తుడిచేసే విధానం కాదు, అది ఆర్థిక ఆత్మహత్య. ఫలితంగా కరెన్సీ విలువ శూన్యానికి చేరింది. నోట్లు చెత్తలా మారాయి. ఇది ఆర్థిక వైఫల్యం కాదుడ దేశ మేధస్సు పతనం.ఇదంతా ఒక తరానికి పరిమితం కాలేదు. ఉచితాల్లో పెరిగిన పిల్లలకు శ్రమ మూర్ఖత్వంగా, ప్రశ్న ద్రోహంగా కనిపించింది. ఇదే అసలు ప్రమాదం. ఒక తరం కాదుడ తరాల మానసిక వంశపారంపర్యం. చావెజ్ తర్వాత నికోలస్ మదురో. వారసత్వ రాజకీయాలు. అర్హత కాదు, కుటుంబం ముఖ్యం. ఎన్నికలు అవసరం లేనివిగా మారాయి. ప్రజాస్వామ్యం ఒక అలవాటు లేని పదంగా మారింది.నేడు వెనిజులా జనాభాలో మెజారిటీ దేశం విడిచి శరణార్థులుగా జీవిస్తోంది. ఒకప్పుడు అందం, ఐశ్వర్యానికి ప్రతీకగా ఉన్న దేశం నేడు ఆకలి కేకల నిలయంగా మారింది. ఇది చరిత్ర. ఇది హెచ్చరిక.భారత్‌కు ఇది ఊహ కాదు. ఉచితాల మత్తు, పరిశ్రమలపై దాడి, పెట్టుబడుల తరిమివేత, కరెన్సీతో మాయలు, వారసత్వ రాజకీయాలు ఇవన్నీ ఒకే స్క్రిప్ట్‌లో భాగాలు. దేశాన్ని కూల్చడానికి యుద్ధాలు అవసరం లేదు. ప్రజల మెదళ్లను బందీ చేస్తే చాలు. వెనిజులా అదే చేసింది. చరిత్ర మనకు చెబుతోంది ఈ మార్గం చివరికి స్వర్గధామం కాదుడ జీవన నరకం.ఇది రాజకీయ ప్రసంగం కాదు. ఇది చరిత్ర ఇచ్చిన స్పష్టమైన హెచ్చరిక.

వెనిజులా పతనం అనేది కేవలం ఒక దేశం ఆర్థికంగా కూలిపోయిన కథ కాదు. అది తరాలుగా కొనసాగిన ఒక మానసిక నేరం. ప్రజల ఆలోచనలను, శ్రమ విలువను, ప్రశ్నించే స్వభావాన్ని నెమ్మదిగా హత్య చేసిన రాజకీయ ప్రయోగం. ఒకప్పుడు లాటిన్ అమెరికాలో అత్యంత సంపన్న దేశంగా, ప్రపంచానికి చమురు సరఫరా చేసే శక్తిగా ఉన్న వెనిజులా నేడు ఆకలి, నిరుద్యోగం, శరణార్థుల దేశంగా మారడం వెనుక తుపాకులు లేవుడ బాంబులు లేవుడ ఉన్నాయి కేవలం మైండ్ మానిప్యులేషన్.వెనిజులా కూలిపోయిందంటే చాలా మంది వెంటనే అమెరికాపై నింద వేస్తారు. అది ఒక భాగం మాత్రమే. అసలు ప్రశ్న ఒక సంపన్న దేశం ప్రజలే ఎలా తమ భవిష్యత్తును నాశనం చేసుకున్నారు? సమాధానం స్పష్టం. ప్రజల మెదళ్లలో ద్వేషం, అసూయ, ఉచితాల మత్తు నాటిన రాజకీయ విధానం. శత్రువుల్ని సృష్టించి, తప్పుడు రక్షకుడిగా మారి, ప్రజాస్వామ్యాన్ని నెమ్మదిగా అంతమొందించిన ఒక స్క్రిప్ట్.హ్యూగో చావెజ్ వచ్చాక మొదలైన ఈ ప్రయాణం, “పెద్ద పరిశ్రమదారులే శత్రువులు” అనే నినాదంతో ప్రజల ఆలోచనలను మలిచింది. ఇది ఆర్థిక విశ్లేషణ కాదు, భావోద్వేగాలపై దాడి. పరిశ్రమలపై ద్వేషం పెరిగింది, పెట్టుబడిదారులు పారిపోయారు. ఆ తర్వాత ఉచితాల వర్షం మొదలైంది. పని చేయకపోయినా డబ్బు, చమురు, సబ్సిడీలు. శ్రమఫలితం మధ్య ఉన్న సహజ సంబంధం తెగిపోయింది. ప్రజలు బ్రతికారుడ కానీ ఆలోచించడం మానేశారు.ఆర్థిక వ్యవస్థ కూలినప్పుడు తీసుకున్న నిర్ణయం మరింత ప్రమాదకరం. “ఎక్కువ నోట్లు ముద్రిద్దాం” అన్న మాయ. ఇది పేదరికాన్ని తుడిచేసే విధానం కాదు, అది ఆర్థిక ఆత్మహత్య. ఫలితంగా కరెన్సీ విలువ శూన్యానికి చేరింది. నోట్లు చెత్తలా మారాయి. ఇది ఆర్థిక వైఫల్యం కాదుడ దేశ మేధస్సు పతనం.ఇదంతా ఒక తరానికి పరిమితం కాలేదు. ఉచితాల్లో పెరిగిన పిల్లలకు శ్రమ మూర్ఖత్వంగా, ప్రశ్న ద్రోహంగా కనిపించింది. ఇదే అసలు ప్రమాదం. ఒక తరం కాదుడ తరాల మానసిక వంశపారంపర్యం. చావెజ్ తర్వాత నికోలస్ మదురో. వారసత్వ రాజకీయాలు. అర్హత కాదు, కుటుంబం ముఖ్యం. ఎన్నికలు అవసరం లేనివిగా మారాయి. ప్రజాస్వామ్యం ఒక అలవాటు లేని పదంగా మారింది.నేడు వెనిజులా జనాభాలో మెజారిటీ దేశం విడిచి శరణార్థులుగా జీవిస్తోంది. ఒకప్పుడు అందం, ఐశ్వర్యానికి ప్రతీకగా ఉన్న దేశం నేడు ఆకలి కేకల నిలయంగా మారింది. ఇది చరిత్ర. ఇది హెచ్చరిక.భారత్‌కు ఇది ఊహ కాదు. ఉచితాల మత్తు, పరిశ్రమలపై దాడి, పెట్టుబడుల తరిమివేత, కరెన్సీతో మాయలు, వారసత్వ రాజకీయాలు ఇవన్నీ ఒకే స్క్రిప్ట్‌లో భాగాలు. దేశాన్ని కూల్చడానికి యుద్ధాలు అవసరం లేదు. ప్రజల మెదళ్లను బందీ చేస్తే చాలు. వెనిజులా అదే చేసింది. చరిత్ర మనకు చెబుతోంది ఈ మార్గం చివరికి స్వర్గధామం కాదుడ జీవన నరకం.ఇది రాజకీయ ప్రసంగం కాదు. ఇది చరిత్ర ఇచ్చిన స్పష్టమైన హెచ్చరిక.

# గుండాల టీటీడీ కళ్యాణ మండపం వేలంపాట






మన గళండోన్ మండలంలోని కోట్రాయి పంచాయతీ పరిధిలోని గుండాల గ్రామ చెన్నకేశవ స్వామి ఆలయం పరిధిలోని నిర్మించినకళ్యాణ మండపము నకు ఈరోజు బుధవారం దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కే శ్రీనివాసులు గ్రేడ్ 1 అధికారి ఆధ్వర్యంలోవేలంపాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో కళ్యాణమండపమునకు ఆదాయము. రూ. 8.20.000.00. అక్షరాల ఎనిమిది లక్షల డెబ్బై వేల రూపాయల నంద్యాల జిల్లా డోన్ మండలం కోట్రాయి పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి గుండాల గ్రామంలో ఉండే వేణుగోపాలస్వామి దేవస్థానం చెందిన స్వామి మాన్యాలు మొదలగు వాటి కోసం 07.01.2025 వ తేదిన ఉదయము 11.00. 10 గంటలకు సదరు కళ్యాణమండపం నుండి దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మొదటిసారిగా బహిరంగ వేళము జరపగా మేదర్ మురళీకృష్ణ కుమారుడు మేదర్ వీరప్రసాద్ డోను పట్టణము మరియు మండలం వారు హెచ్చుపాకదారినిగా వేలంపాటయందు పాల్గొన్నారు. వేలం నందు 7 మంది లక్ష రూపాయలు ప్రకారము చెల్లించి వేలం నందు పాల్గొన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ సీఐ సీఎం రాకేష్, ఎస్సై మమత ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో బి రమేష్ ఇన్స్పెక్టర్, పి బాల చెంచన్న, వై బ్రహ్మానందరెడ్డి, మరియు ఎస్ గుండాల సర్పంచ్ ఆలమకొండ గిరి ప్రసాద్ రెడ్డి, గుండాల నారాయణస్వామి, గుండాల శ్రీనివాసులు, గుండాల సెరభారెడ్డి, గుండాల ఈ లక్ష్మీదేవి, పోలీసులు సురేష్ హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి, జేసీ లక్ష్మీ నాగరాజు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కిసాన్ మోర్చా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

సరికొత్త ప్రజా సేవా కార్యక్రమాలను ప్రకటించిన జిల్లా అధ్యక్షులు.






( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ రైతులు మరియు సామాన్యుల కోసం పార్టీ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను వివరించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కురువ బసవరాజు మరియు కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పలు నూతన కార్యక్రమాలను ప్రకటించారు.జనతా వారధిలతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మండలానికి మరియు జిల్లాకు ‘త్రిమెన్ కమిటీ‘ని ఏర్పాటు చేశామని, ప్రతి సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. మన ఊరు, మన జెండా కార్యక్రమంతో గ్రామాల్లోని జెండా స్తంభాలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా గ్రామానికి కేంద్రం నుండి వచ్చిన 13, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, మంజూరైన రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనుల వివరాలు ప్రజలు నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ‘నెట్ సెంటర్‘ ఏర్పాటు చేసి, ఆయుష్మాన్ భారత్, జనన/మరణ ధృవీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు వంటి సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు సబ్సిడీతో గొర్రెలు, ఆవులు, బర్రెల పెంపకం కోసం తీసుకునే రుణాలపై కేంద్రం 50% సబ్సిడీని అందిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా, మోదీ గారు ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి గడపకు చేర్చడానికి కిసాన్ మోర్చా సైనికుల్లా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ, సోమప్ప, శ్రీధర్, మరియు బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల పెండింగ్ లో ఉన్న 4 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలి సీఐటీయూ డిమాండ్




మన గళం గూడూరు: గూడూరు నగర పంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల నాలుగు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శాంతన్న అధ్యక్షతన మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు “"నిరసన “"కార్యక్రమం చేయడం జరిగింది అనంతరం కమిషనర్ రమేష్ బాబు ను వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి సిఐటియు డివిజన్ కార్యదర్శి జే,మోహన్ హాజరై మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీతాలు నాలుగు నెలలుగా పెండింగ్ లో ఉన్నాయని, జీతాలు చెల్లించాలని అనేక దఫాలుగా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, అయినా అధికారులు జీతాలు చెల్లించలేదని, పారిశుద్ధ కార్మికులకు పెద్ద పండగ అయినటువంటి క్రిస్ మస్ పండుగ కు కూడా జీతాలు లేకపోవడంతో కార్మికులు పండగ రోజు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలను అంటురోగల బారిండి కాపాడుతున్న పారిశుధ్య కార్మికులకు పండగపూట పస్తులు పెట్టడం దుర్మార్గమని, జీతాలు లేక కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందికరంగా మారిందని, కార్మికులు కిరాణం దుకాణాల్లో తెచ్చుకున్న సరుకుల అప్పు, అదేవిధంగా బయట చేసిన అప్పులను వెంటనే చెల్లించాలని దుకాణం దారులు బయట వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నారని. కొత్తగా అప్పులు ఇవ్వడం లేదని, మున్సిపల్ కార్మికులు ఈ రకంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే పారిశుద్ధ కార్మికుల జీతాలను చెల్లించి వారిని ఆదుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు,,కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మనోహరమ్మ,రాము గుంతన్న, దుర్గన్న, గ్రేసమ్మ, అచ్చమ్మ, , మల్లేశ్వరి, సూర్య శేఖర్, శేఖర్, రాజమణి, నాగమణి, గోపాల్, రాజు, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు

# జగనన్న పుట్టినరోజు కానుకగా ఏడాదంతా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తాం



మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ గూడూరు పట్టణంలో మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రోత్సాహంతో నియోజకవర్గ ప్రజలకు గత ఏడాది డిసెంబర్ 21న జగనన్న పుట్టినరోజు కానుకగా ఏడాదంతా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తాం అని ఇందులో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు దృష్టిలోపంతో బాధపడుతూ చూపు కోల్పోయే అంచున ఉన్న అనేక మంది పేదలకు ఈ కార్యక్రమం ఆశాకిరణంగా మారింది. ఈ నెల 6వ తేదీన వైద్యులు నిర్ధారించిన పేదలకు కర్నూలులో డాక్టర్ ఆదిమూలపు సతీష్ దగ్గరుండి ఆపరేషన్లు చేయించారు ఆపరేషన్ తర్వాతడ ఇంటికి చేరే వరకు బాధ్యత వారే వహించారు ప్రతి గ్రామంలో కంటి వైద్య శిబిరాలు,ఉచిత మందులు, కళ్లద్దాలు, అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు

# ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**– నెలవారీ ప్రణాళికతో లక్ష్య సాధనకు కృషి చేయాలి – పురోగతి లేని మండలాలపై ప్రత్యేక దృష్టి – నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి**

మనగళం, నంద్యాల: ఉగాది పండుగ నాటికి జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ డీఈలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా జిల్లాకు కేటాయించిన 14,868 ఇళ్ల నిర్మాణాలను నియోజకవర్గాల వారీగా స్పష్టమైన లక్ష్యాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం రూఫ్ స్థాయిలో ఉన్న 1,583 ఇళ్లు, లింటెల్ స్థాయిలో ఉన్న 2,805 ఇళ్లు, బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న 6,880 ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసేలా హౌసింగ్ ఇంజనీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పిఎం జన్మన్ పథకం కింద వివిధ దశల్లో ఉన్న 556 ఇళ్ల నిర్మాణాలు కూడా నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో నెలవారీ ప్రణాళికలు రూపొందించి, పూర్తి చేయాల్సిన ఇళ్ల వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు, డీఈలకు స్పష్టంగా అందజేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులను ప్రత్యక్షంగా కలసి, ఇళ్ల నిర్మాణాల ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పిస్తూ పనులు పూర్తి చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గడివేముల మండలాల్లో ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తక్కువ పురోగతి సాధించిన మండలాలను ప్రత్యేకంగా తనిఖీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు హౌసింగ్ 2.0 (పీఎంఏవైయూ 2.0) పథకం ద్వారా పట్టణ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా, సానుకూల దృక్పథంతో పనిచేస్తూ, ముఖ్యంగా రూఫ్ స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులకు ఆదేశించారు.



# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : జాతీయ రహదారులపై జరుగుతున్న రహదారి ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. పోలీసు అధికారులు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో వెంటనే స్పీడ్ బ్రేకర్లు, రహదారి సూచిక బోర్డులు, స్పీడ్ గన్స్, పవర్‌ఫుల్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం (జనవరి 1 నుండి 31 వరకు)లో భాగంగా జిల్లా రహదారి భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఏఎస్పీ మంద జవాలి అల్ఫోన్స్, డీటీసీ శివారెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామంజీ నాయక్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-40, 44, 340సి, 167కే రహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా పోలీసు శాఖ గుర్తించిన యాక్సిడెంట్ జోన్లలో తక్షణ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి అంశాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌హెచ్-40లోని సోమయాజులపల్లె, ఆళ్లగడ్డ, చాబోలు జంక్షన్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ సరైన సర్వీస్ రోడ్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తమ్మరాజుపల్లె ప్రాంతం ప్రమాదాల కేంద్రంగా మారినందున అక్కడ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్-340సి మండ్లెం నుంచి ఆత్మకూరు వరకు రహదారి నిర్మాణం పూర్తైనప్పటికీ, అండర్‌పాసులు, సర్వీస్ రోడ్లు లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గోడౌన్లకు వెళ్లేందుకు ఎక్కువ దూరం తిరగాల్సి వస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి రెండు కిలోమీటర్లకు ఏర్పాటు చేసిన ఎస్‌ఓఎస్ బాక్సులు అత్యవసర సమయాల్లో టోల్ ప్లాజా ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారం అందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. ఎన్‌హెచ్-40లో తగిన విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వెంటనే రహదారి లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఎన్‌హెచ్-44లో సర్వీస్ రోడ్లు, విద్యుత్ సరఫరా, పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు.




రానున్న మహాశివరాత్రి పర్వదినం దృష్ట్యా శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో రోడ్డు మిర్రర్లు, స్పీడ్ బంప్స్ ఏర్పాటు చేసి భద్రతను మరింత పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యార్థి బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఆయా బస్సుల్లో కేవలం విద్యార్థులే ప్రయాణించే విధంగా పర్యవేక్షణ పెంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గత గణాంకాలను ప్రస్తావిస్తూ 2024 సంవత్సరంలో 542 ప్రమాదాలు జరిగి 271 మంది మృతి చెందగా, 2025 సంవత్సరంలో 567 ప్రమాదాలు జరిగి 296 మంది మృతి చెందినట్లు తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని 2026లో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు కఠిన చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-40లో చీకటి కారణంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, తక్షణమే విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఎన్‌హెచ్-340సి వద్ద డ్రమ్స్ ఏర్పాటు వల్ల ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో, అక్కడ ప్రత్యేకంగా భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిద్దలూరు, ప్యాపిలి ఘాట్ రోడ్డు మార్గంలో కూడా ప్రమాద నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులకు అనుసంధానమయ్యే మార్గాల్లో స్పీడ్ బ్రేకర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఎన్‌హెచ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యం

**– 150 ముస్తాబు కిట్ల పంపిణీ**
**– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని, ఆ దిశగా విద్యార్థలను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టితో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 150 ముస్తాబు కిట్లను అందజేయడం అభినందనీయమన్నారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, బీసీ హాస్టళ్లలోని విద్యార్థులకు అవసరమైన ముస్తాబు కిట్లను జిల్లా పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణితో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. చిన్న వయసులోనే పరిశుభ్రత అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ప్రతి హాస్టల్, తరగతి గదిలో "ముస్తాబు కార్నర్" ఏర్పాటు చేసి అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత పాటించే విద్యార్థులను "పరిశుభ్రత నాయకులు"గా నియమించి, చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత అలవాట్లను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పొందడమే కాకుండా, ఇంటికి వెళ్లిన తర్వాత కూడా పరిశుభ్రత పాటించే విషయాలను తమ తల్లిదండ్రులకు వివరించే స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# రుణం పొందడానికి తెలివైన మార్గం..




హైదరాబాద్ , మన గళం :అకస్మాత్తుగా వైద్య ఖర్చులు, వివాహ వ్యయాలు, వ్యాపార అవసరాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు చాలామందికి వెంటనే గుర్తుకు వచ్చేది రుణం తీసుకోవడమే. అయితే కొత్తగా వ్యక్తిగత రుణం తీసుకోవాలా లేదా ఇప్పటికే కొనసాగుతున్న రుణంపై అదనపు మొత్తాన్ని టాప్ అప్ రూపంలో పొందాలా అనే సందిగ్ధత చాలా మందిని అయోమయానికి గురి చేస్తోంది. తొందరపడి నిర్ణయం తీసుకుంటే తరువాత ఎక్కువ వడ్డీ భారం మోపాల్సి వస్తుంది. అందుకే రెండు ఎంపికలను పూర్తిగా అర్థం చేసుకుని నిర్ణయం తీసుకోవడం చాలా అవసరం. ఇప్పటికే రుణం తీసుకుని వాయిదాలు సకాలంలో చెల్లిస్తున్న వారికి బ్యాంకులు టాప్ అప్ సౌకర్యం కల్పిస్తాయి. ఇందులో పాత రుణానికే అదనంగా కొంత మొత్తాన్ని జతచేసి కొత్త నిధులు అందిస్తారు. దీంతో కొత్తగా రుణం ప్రారంభించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా ఈ టాప్ అప్ పై వడ్డీ రేటు కొత్త రుణంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. పత్రాలు ఇప్పటికే బ్యాంకు వద్ద ఉండటంతో ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. కొన్ని సందర్భాల్లో ప్రాసెసింగ్ ఫీజులు కూడా చాలా తక్కువగా లేదా లేకుండానే ఉంటాయి.అయితే ప్రతిసారి టాప్ అప్ తీసుకోవడమే ఉత్తమమని భావించకూడదు. కొన్ని బ్యాంకులు టాప్ అప్ పై ఎక్కువ వడ్డీ విధించే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో మరో బ్యాంకు తక్కువ వడ్డీతో కొత్త వ్యక్తిగత రుణం ఆఫర్ చేస్తే అది లాభదాయకంగా మారవచ్చు. ముఖ్యంగా టాప్ అప్ తీసుకున్నప్పుడు పాత రుణం, కొత్త మొత్తం కలిపి మళ్లీ వడ్డీ లెక్కింపు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది. దీని వల్ల మొత్తం రుణ కాలపరిమితి పెరిగి, చివరికి ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి రావచ్చు. కాబట్టి తక్కువ వాయిదా చూసి మోసపోకుండా, మొత్తం ఎంత వడ్డీ చెల్లించాలో ముందే లెక్కించుకోవాలి. రెండు ఎంపికలలో మొత్తం భారం తక్కువగా ఉండేదే ఎంచుకోవడం తెలివైన నిర్ణయం అవుతుంది.గమనిక: ఈ సమాచారం అవగాహన కోసం మాత్రమే. రుణ నిర్ణయాలు తీసుకునే ముందు ఆర్థిక నిపుణుల సలహా తప్పనిసరిగా తీసుకోవాలి.

గురువారం
08- 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# సమంత మా ఇంటి బంగారం

హైదరాబాద్ , మన గళం : : స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా ముందుకు సాగుతోంది. వెబ్ సిరీస్‌లకు ప్రాధాన్యం ఇస్తూనే తన నటనా పరిధిని విస్తరిస్తున్న ఆమె, బాలీవుడ్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత మళ్లీ పూర్తి స్థాయి తెలుగు సినిమాపై దృష్టి పెట్టింది. ఇటీవలి కాలంలో శుభం సినిమాలో చిన్న పాత్రతో ప్రేక్షకులను పలకరించిన సమంత నుంచి ప్రధాన పాత్రలో సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ నిరీక్షణకు తెరదించుతూ ఆమె నటిస్తున్న క్రైమ్ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న మా ఇంటి బంగారం సినిమా నుంచి కీలక సమాచారం వెలువడింది.కొన్ని కారణాల వల్ల ఆలస్యమైన ఈ సినిమా ఇటీవల మళ్లీ పట్టాలెక్కింది. దర్శకురాలు నందిని రెడ్డి నేతృత్వంలో షూటింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే దిశగా చిత్ర బృందం అడుగులు వేస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మాస్ పోస్టర్‌ను విడుదల చేసిన సమంత, జనవరి 9న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. పోస్టర్‌లో సమంత పవర్ ఫుల్, ఇంటెన్స్ లుక్‌లో కనిపించడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. ఇప్పటివరకు ఆమె చేసిన పాత్రలకు భిన్నంగా ఈ చిత్రంలో క్రైమ్ యాక్షన్ నేపథ్యంలో గట్టి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి కథను ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరు అందించడం విశేషం. అలాగే ఈ సినిమాను సమంత తన సొంత నిర్మాణ సంస్థ ద్వారా నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ ఆమెకు మరింత ప్రత్యేకంగా మారింది. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తుండటంతో నేపథ్య సంగీతం, పాటలపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. కమర్షియల్ అంశాలతో పాటు బలమైన కథనం, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.మొత్తానికి వెబ్ సిరీస్‌లతో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు సంపాదించిన సమంత, ఇప్పుడు తెలుగులో ఒక పవర్ ఫుల్ థియేటర్ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరిగింది. జనవరి 9న విడుదలయ్యే టీజర్‌తో మా ఇంటి బంగారం సినిమాపై మరింత స్పష్టత వచ్చే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.








# బాలకృష్ణ బోయపాటి కాంబోలో తొలి ఫ్లాప్

హైదరాబాద్ , మన గళం : టాలీవుడ్ స్టార్ హీరో బాలకృష్ణ తాజాగా అఖండ 2 చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 12న విడుదలైంది. బాలకృష్ణ బోయపాటి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సింహ, లెజెండ్, అఖండ చిత్రాలు భారీ విజయాలు సాధించగా, ఈసారి హ్యాట్రిక్ కొనసాగలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. అఖండ 2 విడుదలైన తొలి రోజు నుంచే నెగటివ్ టాక్ ఎదుర్కొంది. భారీ బడ్జెట్‌తో నిర్మించినప్పటికీ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయింది. మొత్తం వ్యాపారం సుమారు 103 కోట్లుగా అంచనా వేయగా, గ్రాస్ వసూళ్లు సుమారు 120 కోట్లు, షేర్ వసూళ్లు దాదాపు 70 కోట్ల వరకు మాత్రమే వచ్చినట్లు సమాచారం. దీంతో బయ్యర్లకు కోట్ల రూపాయల నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై దర్శకుడు బోయపాటిపై బయ్యర్లు అసంతృప్తిగా ఉన్నారని పరిశ్రమలో చర్చ జరుగుతోంది.అఖండ 2 ఫలితం బాలకృష్ణ తదుపరి ప్రాజెక్ట్‌పై కూడా ప్రభావం చూపుతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కాల్సిన ఎన్బీకే 111 ప్రాజెక్ట్ ప్రస్తుతం హోల్డ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. ఈ సినిమా పీరియాడికల్ హిస్టారికల్ యాక్షన్ నేపథ్యంలో రూపొందించాలనే ఆలోచనతో, బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేయనున్నారని ప్రచారం జరిగింది. ఒక పాత్రలో రాజుగా, మరో పాత్రలో యోధుడిగా కనిపించాల్సి ఉండగా, అఖండ 2 పరాజయం కారణంగా బడ్జెట్ తగ్గింపు, కథలో మార్పులు జరుగుతున్నాయని తెలుస్తోంది. భారీ పీరియడ్ ఎపిసోడ్స్ తగ్గించి, సాధారణ కమర్షియల్ అంశాలు పెంచే దిశగా మేకర్స్ ఆలోచిస్తున్నారని సమాచారం. కథ ఫైనల్‌గా ఓకే అయితేనే షూటింగ్ ప్రారంభమవుతుందని, లేకపోతే ఈ ప్రాజెక్ట్ పూర్తిగా రద్దు అయ్యే అవకాశం కూడా ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబోలో చివరగా వచ్చిన వీర సింహారెడ్డి విజయం తర్వాత ఎన్బీకే 111పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అఖండ 2 ఫలితం ఆ అంచనాలపై నీడ వేసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ భవిష్యత్ ఏంటి అనే అంశం సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అభిమానులు కూడా బాలయ్య తదుపరి అడుగు ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సుధీర్ బాబు జటాధర ఇక హిందీలో కూడా..



హైదరాబాద్ , మన గళం : ధిటాలీవుడ్ నటుడు సుధీర్ బాబు నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రం జటాధర. వెంకట్ కల్యాణ్ కథనంతో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదలైంది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. థియేటర్లలో నిరాశపరిచిన తర్వాత ఈ మూవీ ప్రముఖ ఓటీటీ వేదికలో స్ట్రీమింగ్‌కు వచ్చింది.ఇప్పటివరకు తెలుగులో మాత్రమే అందుబాటులో ఉన్న జటాధర సినిమాను ఇప్పుడు హిందీ భాషలో కూడా విడుదల చేశారు. దీంతో నార్తిండియా ప్రేక్షకులు కూడా ఈ చిత్రాన్ని చూసే అవకాశం లభించింది. గతంలో పలు తెలుగు సినిమాలు థియేటర్లలో విఫలమైనప్పటికీ, హిందీ డబ్బింగ్ వెర్షన్లలో మంచి ఆదరణ పొందిన సందర్భాలు ఉన్నాయి. ఆ నేపథ్యంలో జటాధర హిందీ వెర్షన్ అక్కడి ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.ఈ సినిమాలో సోనాక్షి సిన్హా కథానాయికగా నటించగా, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో కనిపించింది. జటాధర చిత్రంతోనే సోనాక్షి సిన్హా తొలిసారి తెలుగు తెరకు పరిచయం అయ్యింది. సినిమాలో సోల్ ఆఫ్ జటాధర అనే ట్రాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే కథనం, స్క్రీన్ ప్లే పరంగా ప్రేక్షకులను పూర్తిగా కనెక్ట్ చేయలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇప్పుడు హిందీ వెర్షన్ ద్వారా ఈ సినిమాకు కొత్త ఊపిరి లభిస్తుందా లేదా అన్నది చూడాలి.

# అంతర్జాతీయ విచిత్ర నడక దినం నవ్వుతో జీవనాన్ని తిరిగి కనుగొనే రోజు



డెస్క్, జనవరి 7 మన గళం :ప్రతిరోజూ ఒకే సమయానికి లేచడం, అదే రహదారిలో ప్రయాణం చేయడం, అదే పని ఒత్తిడిలో గడపడం... ఇలా జీవితం యంత్రంలా మారిపోయిందన్న భావన చాలా మందిలో ఉంది. ఈ యాంత్రిక జీవనశైలిలో మనిషి తన సహజమైన ఆనందాన్ని, నవ్వును క్రమంగా కోల్పోతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో, జీవితం కేవలం బాధ్యతల సమాహారం మాత్రమే కాదని, ఆనందం కూడా అంతే ముఖ్యమని గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జనవరి 7న అంతర్జాతీయ విచిత్ర నడక దినాన్ని నిర్వహిస్తారు. ఈ దినం వెనుక ఉన్న ఆలోచన చాలా సరళమైనదే. కాస్త విచిత్రంగా నడవండి, నవ్వండి, నవ్వించండి. అంతే. కానీ ఈ చిన్న చర్య వెనుక ఉన్న సందేశం మాత్రం చాలా లోతైనది. మనిషి రోజూ తన భావోద్వేగాలను దాచుకుంటూ జీవిస్తున్నాడు. సమాజం ఏమనుకుంటుందో, ఇతరులు ఎలా చూస్తారో అన్న భయంతో తన సహజ స్వభావాన్ని అణచివేస్తున్నాడు. విచిత్ర నడక దినం ఆ భయాన్ని కాసేపు పక్కన పెట్టి, స్వేచ్ఛగా నవ్వాలని, నిర్భయంగా ఆనందాన్ని వ్యక్తపరచాలని చెబుతుంది.మానసిక ఆరోగ్యం పరంగా చూస్తే, ఈ దినానికి ఉన్న ప్రాధాన్యం మరింత ఎక్కువ. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు సాధారణమైపోయాయి. వీటికి మందులే పరిష్కారమని చాలామంది భావిస్తారు. కానీ నిపుణులు చెప్పేది వేరే. సహజమైన నవ్వు, చిన్నపాటి వినోదం కూడా మానసిక ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుందని వారు చెబుతున్నారు. విచిత్రంగా నడవడం వల్ల కలిగే నవ్వు, మన శరీరంలో సానుకూల హార్మోన్లను విడుదల చేసి, మనసుకు హాయిని ఇస్తుంది. ఈ దినం సృజనాత్మకతను కూడా ప్రోత్సహిస్తుంది. ఒకే విధంగా ఆలోచించడం, ఒకే పద్ధతిలో పనిచేయడం వల్ల మన మెదడు కూడా ఒక నిర్దిష్ట పరిమితిలోనే తిరుగుతుంది. కానీ విచిత్ర నడక లాంటి భిన్నమైన చర్యలు మన ఆలోచనల దారిని మార్చుతాయి. కొత్తగా ఆలోచించే శక్తిని పెంచుతాయి. ఇది కేవలం వినోదానికే పరిమితం కాకుండా, పని ప్రదేశాల్లోనూ, విద్యారంగంలోనూ సృజనాత్మకతను పెంచే ప్రభావాన్ని చూపిస్తుంది.సామాజిక కోణంలో చూసినప్పుడు కూడా ఈ దినం ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. మనుషుల మధ్య దూరాలు పెరుగుతున్న ఈ కాలంలో, నవ్వు ఒక వంతెనలా పనిచేస్తుంది. వీధుల్లో, కార్యాలయాల్లో, పాఠశాలల్లో కలిసి విచిత్రంగా నడిచినప్పుడు, అపరిచితుల మధ్య కూడా ఒక అనుబంధం ఏర్పడుతుంది. మాటలు లేకుండానే నవ్వు ద్వారా మనుషులు ఒకరికొకరు దగ్గరవుతారు. ఇది సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందిస్తుంది. చిన్నపిల్లల ప్రపంచంలో విచిత్ర నడకలు, ఆటలు సహజం. కానీ పెద్దవాళ్లయ్యాక ఆ సహజత్వాన్ని మనం కోల్పోతాం. బాధ్యతల భారం, సమాజపు అంచనాలు మనల్ని గంభీరులుగా మార్చేస్తాయి. అంతర్జాతీయ విచిత్ర నడక దినం మనలో దాగి ఉన్న ఆ చిన్నపిల్లను మళ్లీ గుర్తు చేస్తుంది. జీవితం అంతా గంభీరంగా ఉండాల్సిన అవసరం లేదని, కాసేపు బాల్యాన్ని తలుచుకున్నా జీవితం మరింత తేలికగా మారుతుందని ఈ రోజు చెబుతుంది. మొత్తంగా చెప్పాలంటే, అంతర్జాతీయ విచిత్ర నడక దినం ఒక వినోదాత్మక వేడుక మాత్రమే కాదు. ఇది జీవన తత్వాన్ని మార్చే ఒక చిన్న ప్రయత్నం. నవ్వు ద్వారా ఒత్తిడిని తగ్గించడం, సృజనాత్మకతను పెంచడం, మనుషుల మధ్య అనుబంధాన్ని బలపరచడం అనే పెద్ద లక్ష్యాలు దీనిలో దాగి ఉన్నాయి. ప్రతిరోజూ ఇలా జీవించలేకపోయినా, కనీసం ఈ ఒక్కరోజైనా నవ్వుతూ, భిన్నంగా నడుస్తూ, జీవితాన్ని కొంచెం తేలికగా తీసుకోవాలని ఈ దినం మనకు నేర్పుతోంది. అదే అంతర్జాతీయ విచిత్ర నడక దినం ఇచ్చే అసలైన సందేశం.



## జీఎస్టీ నేపథ్యంలో సిగరెట్ ప్రియులకు షాకిస్తున్న డీలర్లు



హైదరాబాద్ 7 జనవరి 2026 మనగళం : అన్నం తినకుండా బతికే వారు ఉన్నా సిగరెట్ అలవాటు ఉన్నవారు దాన్ని మానేయడం చాలా కష్టమనే విషయం తెలిసిందే. అలాంటి సిగరెట్ ప్రియులకు ఇప్పుడు పెద్ద షాక్ తగలనుంది. జీఎస్టీ పెంపు నేపథ్యంలో సిగరెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయనే సమాచారం రావడంతో దేశవ్యాప్తంగా డీలర్లు ముందుగానే మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ఐటీసీ కంపెనీకి చెందిన సిగరెట్ల విషయంలో మార్కెట్లో కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం జీఎస్టీ పెంపుతో సిగరెట్ల ధరలు దాదాపు 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 170 రూపాయలుగా ఉన్న కొన్ని సిగరెట్ ప్యాకెట్లు రేటు పెరిగిన తర్వాత 250 రూపాయలకు చేరవచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కడప జిల్లాకు చెందిన కొంతమంది డీలర్లు సిగరెట్లను కావాలనే నిల్వలో ఉంచి మార్కెట్లో అందుబాటులో లేకుండా చేస్తున్నారని సమాచారం. సిగరెట్లు లేవు, కంపెనీ నుంచి స్టాక్ రాలేదని చెప్పుతూ వినియోగదారులను వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. ధరలు పెరిగిన తర్వాత స్టాక్ బయటకు తీసి విక్రయిస్తే భారీ లాభాలు వస్తాయనే ఉద్దేశంతోనే ఈ వ్యూహం అమలు చేస్తున్నారని వ్యాపార వర్గాలు చర్చించుకుంటున్నాయి. ముఖ్యంగా ఐటీసీకి చెందిన ప్రముఖ బ్రాండ్ల సిగరెట్లు మార్కెట్లో కనిపించకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీలర్లు బ్లాక్ మార్కెట్ ద్వారా సిగరెట్లు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తానికి జీఎస్టీ పెంపు వార్తలతో సిగరెట్ మార్కెట్లో ఇప్పటికే కలకలం మొదలైంది. రేట్లు అధికారికంగా పెరిగేలోపు డీలర్లు చేసిన ఈ చర్యలు సిగరెట్ ప్రియులకు మరింత భారంగా మారుతున్నాయి. అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో, మార్కెట్లో పరిస్థితి ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందో చూడాలి.

# మెడికల్ షాప్ పెట్టాలంటే ఇవి తప్పనిసరి.. సర్టిఫికేట్లు లేకుంటే రద్దే

హైదరాబాద్ 7 జనవరి 2026 మనగళం : వ్యాపారం ప్రారంభించాలని భావించే వారికి మెడికల్ షాప్ మంచి ఆదాయం ఇచ్చే అవకాశంగా మారింది. అనారోగ్యం వచ్చినప్పుడు ప్రజలు మొదట గుర్తుచేసుకునేది మెడికల్ షాప్ కావడంతో ఈ రంగానికి డిమాండ్ ఎప్పటికీ తగ్గదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే మెడికల్ షాప్ ప్రారంభించాలంటే కొన్ని తప్పనిసరి అర్హతలు, అనుమతులు ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అవసరమైన సర్టిఫికేట్లు లేకుండా షాప్ ప్రారంభిస్తే వెంటనే రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.మెడికల్ షాప్ పెట్టాలంటే ముందుగా ఫార్మసీ విద్యార్హత ఉండాలి. బీ ఫార్మసీ లేదా ఫార్మసీలో డిప్లొమా పూర్తి చేసి ఉండటం తప్పనిసరి. బీ ఫార్మసీ కోర్సు నాలుగు సంవత్సరాలు, డిప్లొమా రెండు సంవత్సరాలు ఉంటుంది. ఈ కోర్సులకు సంబంధించిన సర్టిఫికేట్లు ఉన్నప్పుడే మెడికల్ షాప్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా రాష్ట్ర ఫార్మసీ చట్టం ప్రకారం ఫార్మసీ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు పొందాలి. దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికేట్లు సమర్పించాలి. మెడికల్ షాప్ ఏర్పాటు చేయబోయే స్థలం చిరునామా, అద్దె ఒప్పందం వంటి వివరాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అన్ని పత్రాలు పరిశీలించిన తర్వాత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ నిర్వహిస్తారు. ఆడిట్, వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతే లైసెన్స్ మంజూరు అవుతుంది. ఈ అనుమతులు వచ్చిన తర్వాత మాత్రమే మెడికల్ షాప్ ప్రారంభించాలి. నిబంధనలను ఉల్లంఘించి లేదా అనుమతులు లేకుండా షాప్ నడిపితే అధికారులు కఠిన చర్యలు తీసుకుని షాప్‌ను మూసివేస్తారని హెచ్చరిస్తున్నారు. కాబట్టి మెడికల్ షాప్ వ్యాపారం చేయాలనుకునే వారు ముందుగా అన్ని నిబంధనలు పూర్తిగా తెలుసుకుని, చట్టబద్ధంగా అనుమతులు పొందిన తర్వాతే ప్రారంభించాల్సిందిగా సూచిస్తున్నారు.

# ఆదోని జిల్లా సాధన కోసం పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్, బాపురం నేతాజీ యూత్ ఆధ్వర్యంలో నిరసన

( ఆలూరు మనగళం ):ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ ఆలూరులో జేఏసీ ఎమ్మార్పీఎస్, సిపిఐ భూపేష్, కత్తి రామాంజనేయులు, ఎల్లప్ప ఆధ్వర్యంలో 27వ రోజు రిలే నిరాహారదీక్ష ఈ సందర్భంగా పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ జనార్ధన్,శివ కూమార్ మాట్లాడుతూ ముఖ్యంగా పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ మా గ్రామాల్లోకాని, మండలంలో కాని ,ఆలూరు తాలూకాలో కాని ఎన్నో సేవ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు మా వంతు చేశాము. అందులో భాగంగానే ఈరోజు ఆదోని జిల్లా కోసం ఈ దీక్షలో పాల్గొనడం జరిగింది అని తెలిపారు. ఈరోజు ఆదోని జిల్లా ఉద్యమం రోజురోజుకు ప్రజల ఆదరణ, రాజకీయ ఆదరణ, అధికారులు ఆదరణ, విప్లవ యువ కిశోర యువత ఆదరణ, నరనరాన ఆదోని జిల్లా అనే రక్తం సరసర అని ఉడుకుతుంది అని అన్నారు. పిల్లలకు మంచి చదువు కావాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే, మా పేద ప్రజలకు మెరుగైన వైద్యం కావాలంటే, మా ప్రాంతాన్ని కి పరిశ్రమలు రావాలంటే మా పేద ప్రజలు వలసలు బ్రతుకులు తగ్గాలంటే, మా రైతన్నలకు త్రాగునీరు, సాగునీరు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందాలంటే ఇది మాటలతో కాదు ఆదోని జిల్లా ఏర్పాటు అయితేనే సాధ్యం అవుతుందని తెలిపారు. ఆదోని జిల్లా హక్కు ఇక్కడ ఉన్న పెద్దల కో, నాయకుల కో ఇక్కడ కూర్చున్నా యువతకో తమ ఇంటికో తమ ఊరికో కాదు, ఆదోని జిల్లా, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ ప్రజల అందరికీ హక్కు కోసం ఈ పోరాటం అని అన్నారు. ఈ పోరాటం రాజకీయ డిమాండ్ కాదు ఈ పోరాటం అందరి జీవన హక్కు అని అన్నారు. పోరాటాలకు రెండు ఉదాహరణలుగా తమిళనాడు రాష్ట్రం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించుకున్నాము. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రం నీ సాధించుకున్నారు అని అన్నారు. ఆంధ్ర రాష్ట్రం మనకు సహజంగా, సులభంగా దక్కలేదు అది ఓ త్యాగ గాథ ఓ అమరుని రక్తంతో, ఆకలితో రాసిన చరిత్ర ఈరోజు మనం గర్వంగా ఆంధ్రులమని చెప్పుకుంటున్నామంటే శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆ మహానియుడి త్యాగం ఆ త్యాగాన్ని మర్చిపోతే మన చరిత్రకి అన్యాయం చేసినట్లు అని తె తెలియజేశారు. ఎంత పెద్ద, పెద్ద సమస్యలు పరిష్కారం అయినప్పుడు ఆదోని జిల్లా సమస్య ఎందుకు పరిష్కారం కాదా అని అన్నారు. ఆదోని జిల్లాకు ఏళ్ల తరబడి నిర్లక్ష్యం ఏళ్ల తరబడి మోసాలు. అని అన్నారు. ఆదోని జిల్లా పోరాటం అందరి ఐక్యతతో సాధించుకుందాం అని అన్నారు. ఆదోని జిల్లా భావితరాల భవిష్యత్తు కోసం ఆదోని జిల్లా కావాలని తెలియజేశారు.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.